


# పోరు తెలంగాణ

డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 శుక్రవారం 02-10-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

## ఇరాక్‌పై అమెరికా, సౌదీ సంయుక్త దాడులు

- ఇరాక్‌లో ఇరాన్ అనుకూల గ్రూపులపై అమెరికా, సౌదీ అరేబియా వైమానిక దాడులు
- డ్రోన్ దాడులకు ప్రతీకారంగానే ఈ చర్యలని ప్రకటించిన అమెరికా సెంట్రల్ కమాండ్
- ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను విజయవంతంగా అడ్డుకున్న అమెరికా బలగాలు
- పశ్చిమాసియాలో 20కి పైగా అమెరికా యుద్ధ నౌకల మోహరింపు
- దాడులు ఆపకపోతే మరిన్ని సైనిక చర్యలు తప్పవని ఇరాన్‌కు హెచ్చరిక



పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. తమ సైనికులు, సౌదీ అరేబియా ఇంధన వనరులే లక్ష్యంగా ఇరాన్ అనుకూల గ్రూపులు జరిపిన డ్రోన్ దాడులకు ప్రతిగా అమెరికా, సౌదీ అరేబియా బలగాలు సంయుక్త దాడులు చేపట్టాయి. తూర్పు ఇరాక్‌లోని ఇరాన్ మద్దతున్న గ్రూపులకు - మిగతా 2 లో

## 'పీఓకే నిరసనకారులు కూడా భారత్‌లాంటి శత్రువులే'

నోరుపారేసుకున్న పాక్ రక్షణ మంత్రి

- పీఓకే నిరసనకారులపై ఖవాజా ఆసిఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు
- 'భారత్‌లాంటి శత్రువులే' అంటూ నోరుపారేసుకున్న రక్షణ మంత్రి
- పాక్ భద్రతా బలగాల కాల్పుల్లో 32 మంది మృతి
- ఇప్పటివరకు 90 మందికిపైగా మృతి చెందినట్లు నివేదికలు
- ఈ తరుణంలో ఖవాజా వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు



పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలు మరోసారి తీవ్ర వివాదానికి దారితీశాయి. పీఓకేలో నిరసనలు చేపడుతున్న వారిని భారత్‌తో సమానంగా - మిగతా 2 లో

## 'గజ్వేల్ గడీ' తర్వాత ఇప్పుడు

# 'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం

- రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- కేటీఆర్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు
- సిరిసిల్లకు రూ. 1,500 కోట్ల కేటాయింపు
- కాంగ్రెస్ నేతకు మంత్రి పదవి హామీ
- బతుకమ్మ చీరలపై కమీషన్ల ఆరోపణలు
- దళితుల అంశంలో బీఆర్ఎస్‌పై విమర్శలు




సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

## నీటి చుక్క వాడకుండా అత్యధిక ధాన్యం పండించిన తెలంగాణ



- కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ పార్టీ బూటకపు ప్రచారం చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు
- మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కన్నెపల్లి పంపు హౌస్‌కు18 కిలోమీటర్ల దూరం ఉందన్నారు
- అన్నారం బ్యారేజ్‌కి రంధ్రాలు ఉన్నాయని CWPRS రిపోర్ట్ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి చుక్క కూడా వాడకుండా భారతదేశంలోనే అత్యధికంగా ధాన్యం పండించిన రాష్ట్రం తెలంగాణ అని - మిగతా 2 లో

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది



- సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదన్న కవిత
- టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే - మిగతా 2 లో

## పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు



- తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్
- నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న
- తదుపరి సీఎం కేసీఆర్ అని ధీమా

పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ - మిగతా 2 లో

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి//హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డీఏలు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2024 నుంచి బకాయి ఉన్న డీఏల్లో రెండు డీఏలను వెంటనే మంజూరు చేయాలని నిర్ణయించింది. ఎరియర్స్‌ను వాయిదాల్లో చెల్లిస్తారు. ఆర్థికంగా భారమైనప్పటికీ ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి గారు ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై ఏటా రూ.2500 కోట్ల భారం పడనుంది. రాష్ట్రంలో ఎల్‌నినో కారణంగా తలెత్తిన పరిస్థితులపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశం సుదీర్ఘంగా చర్చించింది. ప్రస్తుత వర్షాకాలంలో దాదాపు 17 శాతం వర్షపాతం




## రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి



- రాజస్థాన్‌కు 800 మెగావాట్ల విద్యుత్ కేటాయింపుపై తీవ్ర అభ్యంతరం
- తెలంగాణ వనరులతో ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఇవ్వడమేంటని ప్రశ్న
- రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలతో ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ - మిగతా 2

## ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ పకడ్బందీగా ఉండాలి



- జాబ్ కేలండర్-2026 రెండో దశ ఉద్యోగాల భర్తీకి కొత్త తేదీ ఖరారు
- సెప్టెంబర్ 15న 3,168 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
- 3, 4 దశల్లోని 5,369 పోస్టులకు అక్టోబర్ 15న ప్రకటన
- ఉద్యోగాల భర్తీలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు ఆదేశం
- మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి న్యాయపరమైన, సాంకేతిక - మిగతా 2 లో

## ఏపీలో యువత ఆగ్రహం కట్టలు తెంచుకుంది



- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్
- అక్రమాలపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించాలన్న వైసీపీ
- జిల్లా కేంద్రాల్లో వైసీపీ విద్యార్థి, యువజన విభాగాల నిరసనలు
- ప్రభుత్వం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని జగన్ ఆరోపణ

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ, స్పోర్ట్స్ కోటాలో జరిగిన అన్యాయం యువతలో - మిగతా 2 లో



# ఏపీలో యువత ఆగ్రహం కట్టలు తెంచుకుంది

మొదటిపేజీ తరువాయి – వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. వైసీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత, ప్రజలతో కలిసి జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన నిరసన ర్యాలీలు విజయవంతమయ్యాయని జగన్ తెలిపారు. డీఎస్సీ అక్రమాలకు పూర్తి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని యువత బలంగా డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. పేపర్ లీకేజీ నుంచి స్పోర్ట్స్ కోటా నియామకాల వరకు జరిగిన ప్రతి అక్రమంపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించాలని ఆయన కోరారు. చంద్రబాబు ప్రభుత్వం లీకులు, అక్రమాలతో ప్రతిభావంతులైన యువత భవిష్యత్తును అంధకారం చేసిందని, వారిని రోడ్డున పడేసిందని జగన్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు గానీ, మంత్రి లోకేశ్ గానీ నోరు మెదపకుండా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

# రైతులను ఆదుకోండి.. సీఎంకు సీపీఐ రామకృష్ణ వినతి

మొదటిపేజీ తరువాయి – మంగళవారం అమరావతిలోని సచివాలయంలో ఆయన ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను రామకృష్ణ ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 21 జిల్లాల్లో 54 శాతం లోటు వర్షపాతం నమోదైందని, 249 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రామకృష్ణ విన్నపంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ఆగస్టు 3వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రామకృష్ణ ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

# రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది

మొదటిపేజీ తరువాయి – గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ (ఖాఖాఖా) బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.

# ఇరాక్‌పై అమెరికా, సౌదీ సంయుక్త దాడులు

మొదటిపేజీ తరువాయి – చెందిన స్థావరాలపై మంగళవారం వైమానిక దాడులు జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఒక ప్రకటనలో తెలిపింది. గత 72 గంటల్లో ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఆదేశాలతో 30కి పైగా డ్రోన్ దాడులు జరిగాయని, వాటికి బదులుగానే ఈ ఆపరేషన్ చేపట్టామని సెంట్‌కామ్ పేర్కొంది. అమెరికా, సౌదీ యుద్ధ విమానాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయని, ఇరాన్ అనుకూల గ్రూపులు ఆయుధాలను నిల్వ ఉంచే ప్రదేశాలు, లాజిస్టిక్స్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నామని వివరించింది. అయితే, ఈ దాడుల్లో జరిగిన నష్టం లేదా ప్రాణనష్టం వివరాలను సెంట్‌కామ్ వెల్లడించలేదు. ఇదే సమయంలో, పశ్చిమాసియాలోని అమెరికా బలగాలపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో దాడికి యత్నించిందని సెంట్‌కామ్ వెల్లడించింది. ఇరాన్ నుంచి ప్రయోగించిన అన్ని క్షిపణులను తమ రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని, తమ బలగాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని స్పష్టం చేసింది. 2026 ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో ఇరాన్ అనుకూల గ్రూపులు అమెరికా పౌరులు, ఆస్తులపై 600కు పైగా దాడులకు ప్రయత్నించాయని సెంట్‌కామ్ గుర్తుచేసింది. "ఐఆర్‌జీసీ, దాని ఉగ్రవాద ప్రాక్సీ గ్రూపులు ఈ దాడులను వెంటనే నిలిపివేయాలి, లేదంటే అమెరికా సైన్యం నుంచి మరిన్ని ప్రతిస్పందనలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని హెచ్చరించింది. మరోవైపు, మధ్యప్రాచ్యంలో 20కి పైగా అమెరికా యుద్ధనౌకలు సైనిక కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నాయని సెంట్‌కామ్ తెలిపింది. ఇరాన్‌పై 'స్టీల్ వాల్ దిగ్బంధం'ను కఠినంగా అమలు చేస్తున్నట్లు, ఇందులో భాగంగా జులై 28 నాటికి 18 వాణిజ్య నౌకలను దారి మళ్లించినట్లు పేర్కొంది.

# రష్యన్ చౌక ఆయిల్‌పై టారిఫ్‌లు?

మొదటిపేజీ తరువాయి – మారితే, రష్యా నుంచి చౌకగా ముడి చమురును భారీగా కొనుగోలు చేస్తున్న భారత్ వంటి దేశాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. ఈ బిల్లు ప్రకారం, రష్యా నుంచి పెద్దమొత్తంలో చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లభిస్తుంది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగిస్తున్న రష్యాకు ప్రధాన ఆదాయ వనరైన ఇంధన విక్రయాలను అడ్డుకోవడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ జాబితాలో భారత్, చైనా, జపాన్‌తో పాటు కొన్ని ఐరోపా దేశాలు కూడా ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి భారత్.. రష్యా నుంచి రాయితీ ధరలకు అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న దేశాల్లో ఒకటిగా నిలిచింది. ఈ బిల్లుకు 'లిండ్సే ఓ.గ్రాహమ్ సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' అని పేరు పెట్టారు. ఇది కేవలం రష్యానే కాకుండా, ఇరాన్‌ను కూడా లక్ష్యంగా చేసుకుంది. అమెరికా కాంగ్రెస్‌లో ఉక్రెయిన్‌కు గట్టి మద్దతుదారుగా నిలిచిన దివంగత సెనేటర్ లిండ్సే గ్రాహం అంత్యక్రియలు జరుగుతున్న రోజే ఈ ఓటింగ్ జరగడం గమనార్హం. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వాషింగ్టన్‌లో పర్యటిస్తున్నారు. అయితే, ఈ బిల్లు చట్టంగా మారడానికి ఇంకా చాలా సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం సెనేట్‌లో జరుగుతున్నది కేవలం ఒక ప్రక్రియపరమైన ఓటింగ్ మాత్రమే. ఇది సెనేట్‌తో పాటు ప్రతినిధుల సభలోనూ ఆమోదం పొందిన తర్వాతే అధ్యక్షుడు ట్రంప్ వద్దకు వెళ్తుంది. ఒకవేళ చట్టంగా మారినా, టారిఫ్‌ల విధింపు వెంటనే జరగదు. వాటిని ఎప్పుడు, ఎవరిపై విధించాలనే విచక్షణాధికారం అధ్యక్షుడికే ఉంటుంది. ఈ బిల్లుకు ఇరాన్‌పై ఆంక్షలను జోడించడంతో అధ్యక్షుడు ట్రంప్ మద్దతు తెలిపారు. కానీ, కొందరు డెమోక్రటిక్ చట్టసభ్యులు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని రాయిటర్స్ పేర్కొంది. ఈ బిల్లు అధ్యక్షుడికి అపరిమిత టారిఫ్ అధికారాలను కట్టబెడుతుందని, ఇది మిత్రదేశాలను సైతం ప్రభావితం చేయవచ్చని, అమెరికా వినియోగదారులపై భారం పడుతుందని వారు వాదిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ బిల్లు ప్రాథమిక దశలోనే ఉంది. దీని భవిష్యత్తు ప్రభావం కాంగ్రెస్ ఆమోదం, అమెరికా ప్రభుత్వ నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

# 'పీఓకే నిరసనకారులు కూడా భారత్‌లాంటి శత్రువులే'



మొదటిపేజీ తరువాయి – శత్రువులుగా చూస్తానంటూ నోరు పారేసుకున్నారు. పాకిస్థాన్ భద్రతా బలగాల కాల్పుల్లో గత రెండు రోజుల్లో పీఓకేలో కనీసం 32 మంది కశ్మీరీ నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వస్తున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఓ వీడియోలో ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ "అక్కడ నిరసన చేస్తున్న వారిని కూడా భారత్‌ను చూసినట్టే చూస్తాను. వాళ్లూ మా శత్రువులే" అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పీఓకేలో శాంతియుతంగా నిరసనలు చేస్తున్న ప్రజలను శత్రువులుగా చిత్రీకరించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జూన్ 5 నుంచి పీఓకేలో హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు 90 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మీర్‌పూర్ నగరంలో భద్రతా బలగాలు ప్రజలపై నేరుగా కాల్పులు జరుపుతున్న దృశ్యాలు, మృతదేహాలను వాహనాల్లో తరలిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త



మొదటిపేజీ తరువాయి – లోటు ఉంది. నిన్నటితో రుతుపవనాల కాలం కూడా ముగిసింది. దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరువు ప్రాంతాల్లో తక్షణం చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ సబ్‌కమిటీలో సమగ్రంగా చర్చించాలని సమావేశం నిర్ణయించింది. ఈ అంశంపై త్వరలోనే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రైతు సంఘాలతో పాటు వివిధ రంగాల నిపుణులతో భేటీలు ఏర్పాటు చేస్తారు. మంత్రిమండలిలో తీసుకున్న నిర్ణయాలపై మంత్రులు పొన్నం ప్రభాకర్ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియాకు వెల్లడించారు. ఎల్‌నినో పరిస్థితులు, చేపట్టాల్సిన ఉపశమన చర్యలపై అన్ని వర్గాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. కరువు మండలాల ప్రకటనతో పాటు రాష్ట్రానికి తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు మంత్రుల బృందం తొందరలోనే ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను నివేదించాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు తగిన ఏర్పాట్లు చేయాలి. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. ఈ సీజన్‌లో దాదాపు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని పౌర సరఫరాల విభాగం అంచనా వేసింది. కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం. ఎల్‌నినో పరిస్థితులతో నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో సాధారణంగా ఒక్క రోజుకు 15,000 మెగావాట్ల విద్యుత్తు వినియోగం ఉండగా.. ఈ సీజన్‌లో అది రికార్డు స్థాయిలో 19,892 మెగావాట్ల పీక్ డిమాండ్‌కు చేరింది. గత ఏడాది మొత్తంలో 16,613 మెగావాట్ల గరిష్ఠ వినియోగం నమోదైంది. విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి, తగినంత విద్యుత్తు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్తు కోత లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్తును సమకూర్చుకోవాలని, డిమాండ్ మేరకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. భవిష్యత్తు డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించింది. దాదాపు 7,800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు, 4,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, 800 మెగావాట్ల పవన విద్యుత్తు యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించింది. కేంద్ర నిబంధనల మేరకు బిడ్డింగ్ విధానంలో ఈ ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకుంది. పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే ఈ మార్కెట్ ఏర్పాటు చేయాలని సూచించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పున: సమీక్షించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈపీసీ విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే రద్దు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా 10 ఈపీసీ సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తెలంగాణలో డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్‌కు ప్రత్యేక పాలసీ అమలు చేసే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ రూపొందించిన డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీకి అనుగుణంగా రాష్ట్రంలో ఈ పాలసీ రూపొందించారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టుతో పాటు మరో నలుగురు గ్రూప్ 1 అధికారులను కూడా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పని చేసేందుకు నియమించాలని మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ

మొదటిపేజీ తరువాయి – రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

## పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

మొదటిపేజీ తరువాయి – వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు. తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

# రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి




మొదటిపేజీ తరువాయి – మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి. హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. సింగరేణి నుంచి రాజస్థాన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ రంగ నిర్వహణలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా ఉత్పత్తి అయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు చెందిన సంస్థకు కేటాయించడంపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సింగరేణి గనుల నుంచి, నీరు గోదావరి నది నుంచి సేకరిస్తున్నారని, అలాగే భూమి కూడా తెలంగాణదేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వనరులతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను మన అవసరాలకు వినియోగించకుండా వేరే రాష్ట్రానికి కేటాయించడంపై నిలదీశారు. తెలంగాణలో విద్యుత్ కోతలతో రైతుల పంటలు ఎండిపోతుంటే, రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ఇవ్వడానికి సిద్ధపడటం దారుణమని హరీశ్ రావు అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు కనీసం 7-8 గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని తన లేఖలో స్పష్టం చేశారు.

# 'గజ్వేల్ గడీ' తర్వాత ఇప్పుడు 'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం



మొదటిపేజీ తరువాయి – బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీని కూల్చుతామని చెప్పి చేసి చూపించామని, ఇప్పుడు సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేద్దామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు. కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తూ.. 'పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ' అంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తన విలువ ఏంటో ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారి అయ్యను అడిగితే తెలుస్తుందని అన్నారు. గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల అభివృద్ధికి రూ. 1,500 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడిని భవిష్యత్తులో మంత్రిని చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతూ.. తాను సీఎం అయిన తర్వాత సీతక్క వంటి సామాన్యులకు మంత్రి పదవులు దక్కాయని పేర్కొన్నారు.

**బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లే**

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీఎం విమర్శించారు. టీవీలు, పేపర్లు, స్టార్ హోటళ్లు, ఫామ్‌హౌస్‌లు మాత్రమే సంపాదించుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్‌ను ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకుని కమీషన్లు తీసుకున్నారని, చివరకు బతుకమ్మ చీరల తయారీలోనూ కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'పుట్టింటి సారె' పేరుతో ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నామని చెప్పారు.

**దళితులపై చిన్నచూపా?**

అసెంబ్లీలో స్పీకర్‌ను దూషించి అవమానించిన ఘనత బీఆర్ఎస్ నాయకులదేనని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎర్రవల్లిలో దళితులు డప్పు కొడితే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కడిగి అణగదొక్కారని ఆరోపించారు. దళితులంటే బీఆర్ఎస్‌కు అంత చిన్నచూపా అని ప్రశ్నించారు. ఎర్రవల్లి భూముల ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావుల అక్రమాస్తులపై లెక్కలు తేలుస్తున్నామని సీఎం అన్నారు. 'ఎట్ హోమ్', 'దక్కన్ స్టార్ హోటల్స్' పేరుతో ఉన్న ఆస్తులు వారి పేర్లకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అసెంబ్లీలో సమయం లేక కొన్ని విషయాలు చెప్పలేకపోయామని, త్వరలో 'పార్ట్-2'లో అన్ని వివరాలు బయటపెడతామని ప్రకటించారు.

# ఆటో డ్రైవర్ బాలు కుటుంబానికి ఆర్థిక సహాయం

### మానవత్వం చాటుకున్న కరకగూడెం ఎస్సై





**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గం-వల్లెపోగు రాము) కరకగూడెం అక్టోబర్ 1:-** కరకగూడెం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మలకుర్తి బాలక్రిష్ణ(బాలు) ఇటీవల అనారోగ్యంతో మరణించారు.ఆయన మృతితో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది.ఈ నేపథ్యంలో బాలు దిశదిన కర్మల (దినవారాల) ఖర్చుల నిమిత్తం పలువురు మానవత్వాన్ని చాటుకున్నారు.కరకగూడెం ఆటో యూనియన్ సభ్యులు బాధిత కుటుంబానికి రూ. 5,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు.అలాగే స్థానిక ఎస్సై నాగేశ్వర రావు సైతం తన ఉదారతను చాటుకుంటూ బాలు కుటుంబ సభ్యులకు రూ. 5,000/- నగదును ఆర్థిక సహాయంగా అందజేసి,బాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కష్టసమయంలో తమకు అండగా నిలిచిన ఆటో యూనియన్ సభ్యులకు, ఎస్సై నాగేశ్వర రావుకు బాలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు కొమరం సాంబశివరావు,గుడ్ల రంజిత్ కుమార్,నిట్టా సౌందర్యరావు,బెజవాడ రాములు,బాదె సాగర్,కొలగాని రవి,యజ్జు సాయి,తోలెం రవి,బంధు సతీష్,నిట్టా సాయి,తోట శివ,నిట్టా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిపై సోలార్ విద్యుత్ బిల్లులకు ఉపశమనం

**పోరు తెలంగాణ / నెక్కొండ, అక్టోబర్ 1:** ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకంపై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు మూడు రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకు నర్సంపేటలోని రైతు వేదిక కార్యాలయ ప్రాంగణంలో ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ, రెడ్ కో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఇంటి పైకప్పులపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, పథకం ద్వారా లభించే ప్రయోజనాలు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై సదస్సులో




అవగాహన కల్పించనున్నారు. వివిధ సోలార్ కంపెనీల ప్రతినిధులు, బ్యాంకుల అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉండి వినియోగదారులకు అవసరమైన సమాచారం, ఆర్థిక సహాయంపై వివరాలు అందించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్ కో అధికారి గంధం రాజేందర్ తదితరులు సదస్సులో పాల్గొననున్నట్లు తెలిపారు. నెక్కొండ మండల పరిధిలోని విద్యుత్ ఏఈ చిరంజీవి, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రజలకు చేరువగా బ్యాంకు సేవలు ఇక అందుబాటులో నెక్కొండలో ఎస్బీఐ సేవా కేంద్రం ప్రారంభం



**పోరు తెలంగాణ నెక్కొండ అక్టోబర్ 1 :** మండల కేంద్రంలోని నర్సంపేట ప్రధాన రహదారిలో కావేరి వైన్స్ సమీపంలో మంచినీళ్ల రమ్య-రణధీర్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) కస్టమర్ సర్వీస్ పాయింట్ ను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎస్బీఐ మేనేజర్ ఐలేష్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి నూతన కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాతాదారుల సౌకర్యార్థం బ్యాంకింగ్ సేవలను మరింత వేగవంతంగా, చేరువగా అందించేందుకు ఈ కస్టమర్ సర్వీస్ పాయింట్ ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఖాతాదారులు నేరుగా బ్యాంకుకు వెళ్లి ఇబ్బంది పడకుండా నగదు జమ, ఉపసంహరణ తదితర సేవలను ఇక్కడే సులభంగా పొందవచ్చని, స్థానిక ఎస్బీఐ వినియోగదారులు ఈ కేంద్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, కస్టమర్లు పాల్గొన్నారు.

# ఏపీఓ తీరుపై ఎంపీడీవోకు మహిళా సంఘం సభ్యురాలి ఫిర్యాదు

### సంబంధిత వ్యక్తుల పట్ల చర్యలు తీసుకోవాలి

### మహిళా సంఘాల సభ్యులకు రక్షణ కల్పించాలి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** తమ వ్యక్తిగత వివరాలు అడుగుతూ మానసిక ఆందోళనకు గురిచేస్తున్న ముప్కాల్ ఏపీఓ,ఆయనతో వచ్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శారద సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యురాలు బ్రహ్మదండి సువర్ణ గురువారం ముప్కాల్ ఎంపీడీవో కు ఫిర్యాదు చేశారు.బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం. సెప్టెంబర్ 28 న ముప్కాల్ ఏ పీ ఓ తో పాటు వచ్చిన మరొక వ్యక్తి తన వ్యక్తిగత వివరాలను అడిగారని,అది అసెంబ్లీకి సంబంధించినది కాదని పేర్కొన్నారు. దీనివల్ల తాను తీవ్ర మానసికంగా ఇబ్బంది పడటంతో పాటు.. భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా,సదరు అధికారులు మహిళా గ్రూప్ సభ్యుల వివరాలను అజ్ఞాతులకు అందజేస్తున్నారని ఆమె ఆరోపించారు.ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి,సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని,అలాగే మహిళా సంఘాల సభ్యులకు రక్షణ కల్పించాలని ఎంపీడీవోకు విన్నవించారు.

# వేంపల్లి గ్రామంలో అభివృద్ధి పనుల ప్రణాళిక కార్యక్రమం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో విబిజి రాంజీ ప్రణాళికలో భాగంగా అభివృద్ధి పనుల రూపకల్పన కార్యక్రమం నిర్వహించారు. గతంలో చేసిన పనులు, ప్రస్తుత అభివృద్ధి కొరకు గ్రామంలో చేయవలసిన పనుల ప్రణాళికను చిత్రపటం రూపంలో ప్రదర్శించారు. అనంతరం గ్రామంలో చేపట్టాల్సిన ప్రస్తుత అభివృద్ధి పనులపై చర్చించారు. సర్పంచ్ మహేష్ యాదవ్, ఎంపీడీవో రమేష్, కార్యదర్శి నరేష్, ఐకెపి సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఉపాధి హామీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించాలి




**పోరు తెలంగాణ నెక్కొండ అక్టోబర్ 1 :** భారత దేశపు ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే విధుల నుండి తొలగించి క్రిమినల్ కేసు పెట్టాలని సిపిఐ (ఎంల్ )మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ కార్యదర్శి కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. నేడు పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేట ఆర్టీవో ఆఫీసులో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా పాలకవర్గాల మెడలు వంచి సాధించుకున్న ఓటు హక్కును జ్ఞానేష్ కుమార్ ఆర్ ఎస్ ఎస్ -బీజేపీతో కుమ్మక్కై తొలగించటం ప్రజాస్వామ్యానికే పెద్ద మచ్చ అన్నారు.12 నుంచి 14 కోట్ల అర్హులైన ఓట్లను తొలగిస్తూ అమిత్ షా అనుకూల సవరణలతో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఎన్నికల వ్యవస్థనే అపహస్యం చేసిన జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి అని అన్నారు. వివిధ రాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీ అనుకూల ఓట్లను తొలగించి హర్యానా బీహార్ పంజాబ్ ఢిల్లీ తదితర రాష్ట్రాలలో బిజెపిని గెలిపించడానికి వ్యూహాత్మక కుట్రలో జ్ఞానేష్ కుమార్ ముద్దాయి అని అన్నారు. ముస్లిం దళితులు ఆదివాసీలు ఇతర నిన్నజాతుల ఆధారాలు సరిగా లేవనే పేరుతో స్వదేశంలోనే వారిని పరాయి దేశస్థులుగా మార్చే విధానం దుర్మార్గమైనదని అన్నారు. జ్ఞానేశ్ కుమార్ పై దేశద్రోహం చేసి పెట్టి వెంటనే అరెస్టు చేయకపోతే ఎల్లి తరహా ఉద్యమాలు దేశవ్యాప్తంగా తలెత్తుతాయని లైవ్ క్రియాశీలకంగా పాల్గొంటుందని తెలిపారు. వెనక ఉన్న పాత్రధారులు పవిత్రదారులైన ఆర్ఎస్ఎస్ బిజెపి అసలు కుట్రలను ఉద్దేశాలు ప్రజలు గమనించి వారికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. దీనిపై విశాల ఐక్య ఉద్యమాలను చేపట్టనున్న రవి తెలిపారు డిప్యూటీ ఎమ్మార్వో శిరీష మేడంకి వినతిపత్రం ఇచ్చారు డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాకు అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మైదం పాణి మాస్ లైన్ డివిజన్ నాయకులు ధార లింగయ్య బానోతులాలు పి వై నాయకుడు చనమల ఆలోచన తో పాటు భద్రయ్య వెంకన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి నాడు మాంస విక్రయాలపై నిషేధం

### కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ఉత్తర్వులు.

### . రెస్టారెంట్లు ,హోటళ్లలోనూ నిరోధించాలని

### గాంధేయవాదుల విజ్ఞప్తి!

**కొత్తగూడెం సెప్టెంబరు 1 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :**జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రేపు (అక్టోబర్ 2) సందర్భంగా కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలో మాంస విక్రయాలను పూర్తిగా నిషేధిస్తూ కార్పొరేషన్ కమిషనర్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ డివిజన్లలో ఉన్న చికెన్, మటన్ మరియు చేపల విక్రయ దుకాణాలన్నీ అక్టోబర్ 2న తప్పనిసరిగా మూసివేయాలని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను అతిక్రమించి ఎవరైనా విక్రయాలు జరిపితే మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు.

**హోటళ్లు, రెస్టారెంట్లలో నాన్-వెజ్ అమ్మకాలపై సందేహాలు:**

అయితే, కార్పొరేషన్ జారీ చేసిన ఈ నోటీసు కేవలం చికెన్, మటన్, చేపల విక్రయ దుకాణదారులకేనా? లేక హోటళ్లు, రెస్టారెంట్లకు కూడా వర్తిస్తుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. అధికారుల ఉత్తర్వుల నేపథ్యాన్ని ఆసరాగా చేసుకుని, కొన్ని హోటళ్లు మరియు రెస్టారెంట్ల యాజమాన్యాలు ముందస్తుగానే (ఈరోజే) అధిక మొత్తంలో మాంసాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నట్లు సమాచారం. రేపు (అక్టోబర్ 2) బంద్ ఉన్నప్పటికీ, తమ వద్ద నిల్వ ఉన్న మాంసంతో నాన్-వెజ్ వంటకాలు సిద్ధం చేసి అమ్మకాలు జరిపి లాభపడేందుకు కొందరు యత్నిస్తున్నారని పట్టణ ప్రజలు, గాంధేయవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అహింసామూర్తి అయిన మహాత్మా గాంధీ జయంతి రోజున కేవలం దుకాణాల మూసివేతకే పరిమితం కాకుండా, హోటళ్లు మరియు రెస్టారెంట్లలో కూడా నాన్-వెజ్ వంటకాల విక్రయాలను పూర్తిగా నిలిపివేసేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ ఏ విధంగా స్పందిస్తారో మరియు ఎలాంటి అదనపు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

# ఆర్టీసీ ఎన్నికలలో బాణం గుర్తును గెలిపించండి

### ఐ ఎన్ టి యు సి మహేశ్వరం నియోజకవర్గం

### కార్మిక శాఖ అధ్యక్షుడు నడికుడి శివ..

**మహేశ్వరం, అక్టోబర్ 1, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** ఈనెల 9న ఘజరిగే ఆర్టీసీ ఎన్నికలలో బాణం గుర్తు రాజిరెడ్డిపై వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్ టీయూసీ కార్మిక శాఖ అధ్యక్షుడు నడికుడి శివ అన్నారు. గురువారం మహేశ్వరం ఆర్టీసీ డిపో ఆవరణలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ యూనియన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఐఎన్ టీయూసీ, ఎస్ డబ్ల్యు యు, టి ఎం యు, ఎస్ డబ్ల్యు ఎఫ్, బలపరిచిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా మొగుళ్ళ రాజిరెడ్డిని బాణం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఎన్నికలలో రాజిరెడ్డి గెలిస్తే కార్మికులకు ఎల్లప్పుడూ అండదండగా ఉంటుందని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు ఆర్టీసీ కార్మికులకు డిఏ, పిఆర్సి, బాండ్లను అందజేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులకు న్యాయం జరగలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేసే విధంగా పనిచేస్తుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవుల యాదయ్య, మహేశ్వరం గ్రామ శాఖ అధ్యక్షుడు బంగారు గల్ల లాజర్, మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల రాజు, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర నవీన్ కుమార్, క్రిస్టియన్ మైనార్టీ



అధ్యక్షుడు స్వామి, ఎస్సీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షుడు బాటరాజు, కందుకూరు మండలం ఐఎన్ టీయూసీ అధ్యక్షుడు గాదె కుమార్ నాయకులు మునావత్ రవి నాయక్, ఐ ఎన్ టి యు సి సెక్రెటరీ రాజు, సోహెల్ అలీ పాల్గొన్నారు.

# కేటీపీయస్ ఆసుపత్రి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### ఫార్మసిస్టులు, స్టాఫ్ నర్సుల పోస్టులు భర్తీ చేయాలి

### డిజిటల్ ఎక్స్‌రే ఏర్పాటు చేయాలి

### టీజీ జెన్కో యాజమాన్యానికి తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ విజ్ఞప్తి

**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, అక్టోబర్ 01(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** కేటీపీయస్ ఆసుపత్రిలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వైద్య సౌకర్యాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్--142) రాష్ట్ర అధ్యక్షుడు కె.వి. రామారావు టీజీ జెన్కో యాజమాన్యాన్ని కోరారు. కేటీపీయస్ ఏ కాలనీలోని యూనియన్ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం టీజీ జెన్కో సీఎండీకి యూనియన్ తరఫున లేఖ పంపినట్లు తెలిపారు.




**ఫార్మసిస్టుల కొరతతో తీవ్ర ఇబ్బందులు**

కేటీపీయస్ ఆసుపత్రిలో అవసరానికి సరిపడా ఫార్మసిస్టులు లేకపోవడంతో మందుల పంపిణీ సేవలకు అంతరాయం ఏర్పడుతోందని రామారావు తెలిపారు. ప్రస్తుతం ఒక్క ఫార్మసిస్ట్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, ఆయన సెలవులో ఉన్నప్పుడు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మందుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో అత్యవసర మందులు అందుబాటులో లేకపోతే రోగులు మరుసటి రోజు తిరిగి ఆసుపత్రికి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా కనీసం మూడు ఫార్మసిస్ట్ పోస్టులను భర్తీ చేసి 24 గంటల మందుల సేవలకు అంతరాయం లేకుండా చూడాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

**స్టాఫ్ నర్సుల పోస్టులు భర్తీ చేయాలి**

ఆసుపత్రిలో తగినంత మంది స్టాఫ్ నర్సులు లేకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందిపై అదనపు పనిభారం పడుతోందని రామారావు తెలిపారు. షిఫ్ట్ విధులు, అత్యవసర వైద్య సేవలు తదితర సందర్భాల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సంఖ్యలో స్టాఫ్ నర్సులను నియమించాలని లేదా డిప్యుటేషన్‌పై కేటాయించాలని కోరారు.

**డిజిటల్ ఎక్స్‌రే సౌకర్యం కల్పించాలి**

కేటీపీయస్ ఆసుపత్రిలో ఆధునిక డిజిటల్ ఎక్స్‌రే సౌకర్యాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని యూనియన్ డిమాండ్ చేసింది. ఈ సమస్యను గతంలో పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదని రామారావు తెలిపారు. ప్రస్తుతం పాత తరహా డార్క్‌రూమ్, ఫిల్మ్ డెవలపింగ్ విధానం కొనసాగుతుండటంతో రోగులు, వైద్య సిబ్బందికి అనవసరమైన ఆలస్యం, ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. డిజిటల్ ఎక్స్‌రే సౌకర్యం అందుబాటులోకి వస్తే పరీక్షలు త్వరగా పూర్తవడంతో పాటు వైద్యులకు వ్యాధి నిర్ధారణలో మరింత మెరుగైన సహకారం అందుతుందని తెలిపారు.

**కాలపరిమితిలోగా పరిష్కరించాలి**

కేటీపీయస్ ఆసుపత్రికి సంబంధించిన ఈ సమస్యలన్నీ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని టీజీ జెన్కో ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కాలపరిమితిలోగా సమస్యలను పరిష్కరించాలని కె.వి. రామారావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాసచారి, సత్యరాజ్, స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, షేక్ సయ్యద్, తోలెం కోటేశ్వరరావు, ద్రాక్ష వేణు కుమార్, శివరాం, బాలు తదితరులు పాల్గొన్నారు.

# "గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ దేశానికి ఆదర్శంగా ఎదగాలి"...!

### సర్పంచ్ భూరెడ్డి స్వాతి వెంకట్ రెడ్డి..

### "విద్యార్థుల్లో స్వచ్ఛత, దేశభక్తి, సేవాభావం పెంపొందించాలి

### రామచంద్రాపురం పాఠశాలలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు"

**భద్రాద్రి కొత్తగూడెం, పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ (ప్రతినిధి-వల్లెపోగు రాము) అశ్వాపురం అక్టోబర్ 1:-** అశ్వాపురం మండలం రామచంద్రాపురంగ్రామంలో జాతిపిత మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, సేవాభావం వంటి విలువలను విద్యార్థులు తమ జీవితాల్లో ఆచరించాలని రామచంద్రాపురం సర్పంచ్ భూరెడ్డి స్వాతి వెంకటరెడ్డి అన్నారు. ముందస్తుగా అక్టోబర్ 2 నా మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకుని ఈరోజు రామచంద్రాపురం ఎం.పీ.యూ.పీ.ఎస్. పాఠశాలలో సర్పంచ్ భూరెడ్డి స్వాతి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు స్వచ్ఛత పోస్టర్స్ తయారీ, గాంధీజీపై వ్యాసరచన పోటీలు





నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వాతి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో స్వచ్ఛతపై అవగాహన, దేశభక్తి, సేవాభావం, శాంతి మార్గం, గాంధీజీ ఆశయాల పట్ల నిబద్ధత పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. చిన్ననాటి నుంచే మంచి విలువలను అలవర్చుకుంటే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగగలరని అన్నారు. "గాంధీజీ మనకు ఇచ్చిన గొప్ప సందేశం సత్యం, అహింస. ఆయన చూపిన మార్గంలో విద్యార్థులు ముందుకు సాగితే సమాజంలో మంచి మార్పు తీసుకురాగలరు" అని సర్పంచ్ పేర్కొన్నారు. పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను, ప్రతిభను చాటుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సర్పంచ్ భూరెడ్డి స్వాతి వెంకటరెడ్డి అభినందించి, ప్రశంసాపత్రాలు/బహుమతులు అందజేశారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు ఇలాంటి సృజనాత్మక, సామాజిక అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. "మనలో మార్పు మొదలైతేనే సమాజంలో మార్పు సాధ్యం" అనే గాంధీజీ స్ఫూర్తితో ప్రతి విద్యార్థి స్వచ్ఛతను తన బాధ్యతగా భావించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రత పై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలి

**పోరు తెలంగాణ ప్రతినిధి // మెట్ పల్లి :** డి ఆర్ డి ఒ ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘువరన్. "స్వచ్ఛతా హి సేవా" పక్షోత్సవాలల్లో భాగంగా ఈ రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లుల్ల లో పాఠశాల ప్రాంగణంలో చెత్తను ఊడ్చి, చెత్త ను తడి, పొడి,శానిటరి వెస్ట్,స్పెషల్ కేర్ వెస్ట్ అని నాలుగు రకాలుగా విభజించి గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది కి అందించాలని విద్యార్థులకు అవగాహనా కలిగిస్తూ,మీ తల్లిదండ్రులకు కూడ మీరు అవగాహనా కలిగించాలని ఆయన తెలిపారు.పరిసరాల పరిశుభ్రత లో ప్రతి ఒక్కరు భాగస్వాముయులు కావాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు రెండవ జత "ఏక రీతి దుస్తులు "(యూనిఫామ్ )కూడ అందజేశారు.ఈ కార్యక్రమంలో మెట్పల్లి డివిజన్ డి ఎల్ పి ఒ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ గూడూరు తిరుపతి, ఉప సర్పంచ్ అనిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,కార్యనిర్వాహనాధికారి రవళి,వార్డ్ సభ్యులు,ఉపాధ్యాయులు, వి. ఒ.సునంద, ఏ ఎన్ ఎమ్ సువర్ణ,అంగన్వాడీ టీచర్స్, ఆశ కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆదర్శ పాఠశాల పాలకొండ విద్యార్థి ఎంపిక



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రుచిత్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ముత్యం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో ఈనెల 2,3,4, తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రుచిత్ ను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్,పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

### మోతే గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** వేల్పూర్ మండలంలోని మోతే గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఎంపీడీవో రఘురాం, సర్పంచ్ డొల్ల రమేష్ ఆధ్వర్యంలో ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఈ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సన్న రకం ఏ గ్రేడ్ 2461 రూపాలకు బోనస్ 500 ఉంది కాబట్టి,దళారులను నమ్మి తక్కువ తరపు అమ్మవద్దని తెలిపారు. ఐకెపిసి సిబ్బంది మాణిక్యం,మురళి, కార్యదర్శి అనిల్, జిపిఓ హరిచరణ్, నాయకులు రాజేశ్వర్ గంగారెడ్డి మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## రూ.1.82 కోట్ల గంజాయి పట్టివేత

365 కేజీల గంజాయి స్వాధీనం.

లారీ కారు బైక్ స్వాధీనం.

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్.



**భద్రాచలం సెప్టెంబర్ 1 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు మూడు వాహనాల్లో తరలి వెళ్తున్న గంజాయిని ఖమ్మం జిల్లా భద్రాచలం డిటిఎఫ్ ఇతర ఎక్సైజ్ టీములు కలిసి పట్టుకున్నారు. ఈ మూడు వాహనాల్లో 365 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 1.82 కోట్లుగా ఉంటుందని ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు.

**కేసు వివరాల్లోకి వెళితే..**

భద్రాచలం వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో డిటిఎఫ్ కొత్తగూడెం టీం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో బైక్ పై వస్తున్న వ్యక్తి వద్ద తొమ్మిది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సా కు చెందిన దివాకర్ మండల్(22) అనే వ్యక్తి వద్ద 9 కిలాల గంజాయితో పాటు బైకును సీజ్ చేశారు. బైక్ వెనక వస్తున్నటువంటి హుందాయి కార్ పై అనుమానం వచ్చి ఎక్సైజ్ టీములు తనిఖీలు నిర్వహించగా కారులో 100 కేజీల గంజాయి లభ్యమైంది. ఈ కేసులో ఎలక్ట్రిషన్ గా పనిచేసే అటువంటి ఒరిస్సాకు చెందిన సుమన్ పాల్ (22) అదుపులోకి తీసుకున్నారు.

## తోర్తి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ఎర్గట్ల మండలంలోని తొర్తి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తక్కువ ధరకు దళారులకు అమ్మి మోసపోకుండా, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివకుమార్,ఎర్గట్ల మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు కౌడ భూమేష్, ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి,ఉప సర్పంచ్ సుమన్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు మహేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగా మోహన్,కార్యదర్శి రాహుల్, ఏపీవో గంగాధర్, రాకేష్, పేపర్ భూమన్న,మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహసిల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి) అశ్వాపురం అక్టోబర్ 1:-** మండల డిప్యూటీ తహసిల్దార్ గా ఇటీవల బాధ్యతలు తీసుకున్న సమ్మయ్య ను గురువారం తహసిల్దార్ కార్యాలయంలో అశ్వాపురం మాజీ ఎంపీపీ కొలు మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం స్వీట్ ను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.గతంలో సమ్మయ్య తో తనకున్న అనుభవాన్ని తనతో పంచుకున్నారూ.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొర్రెముచ్చు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఏషియన్ గేమ్స్‌లో బ్యాట్మెంటన్ లో బ్రాంజ్ మెడల్(కాంస్య పతకం)సాధించిన తరుణ్ మానేపల్లి



**మహేశ్వరం, అక్టోబర్ 1, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్‌లోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రతిష్టను చాటిచెప్పారు. కళాశాలలో సి.ఎస్.సి విభాగంలో చదువుతున్న విద్యార్థి తరుణ్ మానేపల్లి ప్రతిష్టాత్మక 2026 ఏషియన్ గేమ్స్ బ్యాడ్మింటన్ పురుషుల టీమ్ ఈవెంట్ లో అద్భుత ప్రదర్శన కనబరిచి బ్రాంజ్ మెడల్ (కాంస్య పతకం) కైవసం చేసుకున్నారు. ఏషియన్ గేమ్స్‌లో పతకం సాధించిన అనంతరం తరుణ్ మానేపల్లి తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో చైర్మన్, మహేశ్వరం మాజీ శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి, కళాశాల సెక్రటరీ హరినాథ్ రెడ్డి , ట్రెజరర్ అమర్నాథ్ రెడ్డి ప్రిన్సిపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం తరుణ్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

**కళాశాల యాజమాన్యాని ధన్యవాదాలు: తరుణ్ మానేపల్లి**

ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుకోవడం నా అదృష్టం చదువుతో పాటు క్రీడల్లో ముందుకు వెళ్లడానికి కళాశాల యాజమాన్యం ముఖ్యంగా చైర్మన్ తీగల కృష్ణారెడ్డి నన్ను ఎంతగానో ప్రోత్సహించారని తెలిపారు. నా విజయంలో కళాశాల సహకారం మరవలేనిదని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల చైర్మన్ శ్రీ తీగల కృష్ణారెడ్డి గారు మాట్లాడుతూ..మొట్టమొదటిసారిగా మన తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థికి ఏషియన్ గేమ్స్ వంటి అంతర్జాతీయ వేదికపై పతకం రావడం ఎంతో సంతోషదాయకం అని అన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమైనవని తెలిపారు. మన కళాశాలలో క్రీడలకు సంబంధించి అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని అన్నారు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని మన తరుణ్ నిరూపించాడు. ఈ విజయం మన రాష్ట్రానికి మరియు తీగల కృష్ణారెడ్డి కళాశాలకు ఎంతో మంచి పేరు తీసుకువచ్చిందిఅని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ హరినాథ్ రెడ్డి, ట్రెజరర్ అమర్నాథ్ రెడ్డి, ప్రిన్సిపల్స్ రామస్వామి రెడ్డి, మురళీకృష్ణ, రేణుక సాగర్ ,విజయ కుంచన ఏవో నరసింహారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జాన్సన్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఓదెల హైస్కూల్ విద్యార్థులు

### ఎంపికైన క్రీడాకారులను అభినందించిన సర్పంచ్ కనికి రెడ్డి సతీష్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 1 గురువారం ఓదెల ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన పేరం అక్షయ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు, బీరం అరవింద్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను సర్పంచ్ అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ, విద్యార్థులు ఇదే స్ఫూర్తితో క్రీడల్లో రాణించి జాతీయస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల పీడీ మాట్లాడుతూ, ఎంపికైన విద్యార్థులు అక్టోబర్ 2, 3, 4, 5 తేదీలలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు విద్యార్థులను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని హరిణి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

**కొత్తగూడెం సెప్టెంబర్ 1 తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఇంద్రపల్లి హరిణి హత్య కేసులో పరారీలో ఉన్న నిందితుడు దేవరకొండ పవన్ కుమార్‌ను జూలూరుపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. 22.09.2026న మధ్యాహ్నం సుమారు 3 గంటల నుంచి 5 గంటల మధ్యలో వెంగన్నపాలెం గ్రామంలోని తన ఇంటి వద్ద ఇంద్రపల్లి హరిణి (18) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు మృతురాలి తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత జతీ.చీశీ.155/2026 ఖ/ం 194 దీచీూ కింద కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా, మెడకు వైర్ వంటి వస్తువుతో బిగించి హత్య చేసినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. దీంతో కేసును U/s 103(1) BNS కింద హత్య కేసుగా మార్చారు. దర్యాప్తులో మృతురాలు హరిణి, నిందితుడు దేవరకొండ పవన్ కుమార్ (22), గత నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నట్లు, వివాహం చేసుకోవాలని భావించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే ఇరువురి కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదాల నేపథ్యంలో హరిణి పవన్ కుమార్‌ను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు, ఈ కారణంతోనే నిందితుడు హరిణిని హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. హత్య అనంతరం నిందితుడు పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో నిందితుడు ఒంటిగూడిసె రోడ్‌లోని సీతారామ ప్రాజెక్టు కాలువ సమీపంలో దాచిపెట్టిన TS-28-G-9583 నంబర్ గల గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని తీసుకుని దూర ప్రాంతానికి వెళ్లి ర్యాపిడోలో పని చేసుకుంటూ జీవించేందుకు ప్రయత్నిస్తున్నాడన్న నమ్మదగిన సమాచారం పోలీసులకు అందింది. సమాచారం మేరకు జూలూరుపాడు సీఐ, ఎస్ఐ మరియు సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నిందితుడు దేవరకొండ పవన్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.

**నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు:**

TS-28-G-9583 నంబర్ గల గ్లామర్ బైక్

రెండు మొబైల్ ఫోన్లు ఒకటి మృతురాలి ఫోన్, మరొకటి నిందితుడి ఫోన్

**బైక్ గేర్ వైర్**

**నిందితుడు ధరించిన షర్ట్**

ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## జిల్లాలో బిజెపి ఓబీసీ మోర్చాను పటిష్ట పరుస్తా

### నూతన రంగారెడ్డి జిల్లా ఓబీసీ బీజేపీ మోర్చా అధ్యక్షుడు పోతర్ల సుదర్శన్ యాదవ్ ..



**మహేశ్వరం, అక్టోబర్ 1, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లాలో బిజెపి ఓబీసీ మార్చాను పటిష్టపరిచేందుకు కృషి చేస్తానని రంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా నూతన అధ్యక్షుడు పోతర్ల సుదర్శన్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మార్చ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా ఆయన రాష్ట్ర ఓబిసి మోర్చా అధ్యక్షుడు గంధ మల్ల ఆనంద్ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పతంగి రాజభూపాల్ గౌడ్, చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ళ వీరేందర్ గౌడ్, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవులను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్ యాదవ్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో బిజెపి ఓబీసీ మోర్చా ను అన్ని రంగాలలో ముందుకు తీసుకపోతానని తెలిపారు. జిల్లా స్థాయిలో బిజెపి పార్టీని బలోపేతం చేస్తూ ఎన్నికలలో అన్ని మండలాల్లో పర్యటించి పార్టీ గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పిన పార్టీ అధిష్టానానికి ఆయన పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి పార్టీ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల మీడియా కన్వీనర్ మోతే యాదయ్య, నాయకులు రవీందర్ రెడ్డి, రాఘవేందర్, నరేష్, గణేష్ పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ నేత బక్కని రవి మాదిగ జన్మదిన వేడుకలు



**మహేశ్వరం, అక్టోబర్ 1, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధికార ప్రతినిధి, కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ కుమారుడు బక్కని రవి మాదిగ జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. అమీర్‌పేటలోని ఆవుల శివాజీ గార్డెన్‌లో నిర్వహించిన ఈ జన్మదిన కార్యక్రమం అంగరంగ వైభవంగా కొనసాగింది. రవి మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆవుల శివాజీ గార్డెన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో రవి మాదిగ కేక్ కట్ చేశారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన నాయకులు, మిత్రులు, అభిమానులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రవి మాదిగకు మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు మునగపాటి నవీన్, మాజీ అధ్యక్షుడు గాదె థామస్ రెడ్డి, సహకార బ్యాంక్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర రెడ్డి నాయకులు రమేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, రవీందర్, బక్కని అశోక్, అంజయ్య, రామస్వామి, ప్రవీణ్, బబ్లు, దుబాయ్ చంద్ర, సర్పంచులు స్లీవారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ, ఎంఆర్పిఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఓబీసీ సింహగర్జన సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయండి



రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి..

**మహేశ్వరం, అక్టోబర్ 1, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** రాష్ట్రంలో బీసీల హక్కుల సాధన, రాజకీయ ప్రాధాన్యం సంక్షేమమే ధ్యేయంగా ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న ప్రతిష్టాత్మక ఓబీసీ సింహగర్జన కార్యక్రమ సన్నాహక సమావేశం రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ లోని గొల్లపల్లి రోడ్డులో నిర్వహించారు. టీపీసీసీ ఓబీసీ ఛైర్మన్, షాద్‌నగర్ శాసనసభ్యులు శ్రీ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ సలహాదారులు వి. హనుమంత్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సన్నాహక సమావేశంలో రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు శ్రీమతి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని వారి హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 4న తలపెట్టిన 'ఓబీసీ సింహగర్జన' సభను చారిత్రాత్మక విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా నుండి ఓబీసీ నాయకులు, కార్యకర్తలు, యువకులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బీసీ వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా వారికి తగిన రాజకీయ మరియు సామాజిక అవకాశాలు దక్కేలా ఈ గర్జన వేదికగా గట్టి సందేశం ఇస్తామని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, చైర్మన్ అజయ్, వైస్ చైర్మన్ బంగారి బాబు, నియోజకవర్గ ఇంచార్జీలు భీం భరత్, జగదీశ్వర్ గౌడ్, ముద్దగౌని వేణు గౌడ్, ఓబీసీ కన్వీనర్లు డా.ధనలక్ష్మి, డా.వెంకటేష్ పీసీసీ మెంబెర్స్ అయిల్ల శ్రీనివాస్ గౌడ్, కొత్తకుర్మ శివ కుమార్, నాయకులు, ఓబీసీ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అదనపు స్థలం కోసం ఎమ్మెల్యే కృషి






**పోరు తెలంగాణ ప్రతినిధి// మెట్ పల్లి :** మెట్ పల్లి కోర్టు కాంప్లెక్స్ కి అవసరం అయిన అదనపు స్థలం కోసం తన శాయ శక్తుల కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కుమార్ అన్నారు. బార్ అసోసియేషన్ సభ్యుల విన్నపం మేరకు ఆయన గురువారం కోర్టుకి అనుకుని ఉన్న ఎస్సారెస్పి భూమిని పరిశీలించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న రెస్సారెస్పి భూమి కోర్టు కాంప్లెక్స్ కి అనుకూలంగా ఉన్నందున ఇట్టి భూమిని ఇరిగేషన్ శాఖ నుండి బదిలీ చేయడానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు అధికారులతో కలసి మాట్లాడతానని హామీ ఇచ్చారు. అనంతరం బార్ అసోసియేషన్ గదిలో మాట్లాడుతూ, న్యాయవాదుల సంక్షేమం కోసం అవసరం అయిన ప్రభుత్వ సహాయం కోసం కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేని బార్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు న్యాయవాదులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, ఉపాధ్యక్షురాలు యం. సుమలత, న్యాయవాదులు మగ్గిడి వెంకట నర్సయ్య, గంద్ర ప్రవీన్ రావ్, కట్టా నర్సాగౌడ్, పుప్పాల లింబాద్రి, ఎలాముల రాంబాబు, ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, కాజీపేట స్రవంతి, ఆకుల ప్రవీణ్, ఆకుల మానస, మోరపు చిరంజీవి, కడారి యుగందర్, లోకిని సుమిత్, సామ అనిరుద్, వంగ వేణు, అంగడి పురుషోత్తం, రజిత ఉన్నారు.

# నూనె రాజేశం కు ఘనంగా సన్మానం

**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** గురువారం రోజున జాతీయ వయోవృద్ధుల దినోత్సవ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో వయోవృద్ధుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త సాహితీగత్త నూనె రాజేశం కవి రచయిత సీనియర్ సిటిజన్ ఆర్గనైజింగ్ నెంబర్ రాజేశం చేసిన సేవలను గుర్తించి చేస్తున్న సేవలను పరిగణలోకి తీసుకొని రాజేశం ను శాలువా మేమోంటో అందజేసి ఘనంగా సన్మానించిన డిసిపి రాంరెడ్డి జిల్లా జర్జీ శ్రీనిజ జిల్లా మెడికల్ ఆఫీసర్ పవిత్ర రిటేడ్ డి పి ఆర్ ఓ వీర బుచ్చయ్య పిటి స్వామి, ప్రముఖ కవి తూము నరసయ్య, సూపర్డెంట్ కొట్టే రాజయ్య ఫీల్డ్ ఆఫీసర్ సుమలత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**పోరు తెలంగాణ, మంచిర్యాల,అక్టోబర్ 1, 2026 :** రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయాలలో ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ- మంచిర్యాల జిల్లా రక్త నిధి కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా తలసేమియా, సికిల్ సెల్, రక్తహీనత వంటి వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు ప్రమాదాలలో గాయపడి అత్యవసరంగా రక్తం కావలసి ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. రక్త నిధి కేంద్రానికి రక్తదాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యా సంస్థలు, సింగరేణి సంస్థ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల యాజమాన్యాలు, స్వచ్ఛంద రక్తదాన శిబిరాల నిర్వాహకులు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తాన్ని అందిస్తూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న అనేక మంది ప్రాణాలను కాపాడటంలో రక్తదాతల సహకారం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. యువత, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని, రక్తదానం ద్వారా అత్యవసర సమయంలో ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అనంతరం అత్యధిక సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన రక్తదాతలు, ప్లేట్లెట్స్ దానం చేసిన స్వచ్ఛంద రక్తదాతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా ప్రతినిధులు, సిబ్బంది, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కలెక్టర్ హరిత....



**పోరు తెలంగాణ అక్టోబర్ 01: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్‌లో గల విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో వృద్ధుల కోసం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సంస్థ కార్యదర్శి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వృద్ధులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు, ఉచిత న్యాయ సహాయం, సంక్షేమ చట్టాలపై వారు అవగాహన కలిగి ఉండాలన్నారు. వృద్ధుల సంరక్షణ, పోషణకు సంబంధించి చట్టపరమైన రక్షణలు ఉన్నాయని తెలిపారు. సమస్యలు ఎదురైతే నిర్భయంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే న్యాయ సహాయం పొందాలని సూచించారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించవచ్చని, ఉచిత న్యాయ సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 14567కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

# అడ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు

అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్....



**పోరు తెలంగాణ అక్టోబర్ 01: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపడతామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్‌తో కలిసి అడ ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని సహజ వనరులు, జలవనరులు, ప్రకృతి అందాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా, సందర్శకులను ఆకర్షించేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. అడ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే స్థానికులకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మెరుగుపడటంతో పాటు జిల్లాకు పర్యాటకుల రాక పెరుగుతుందని చెప్పారు. పర్యాటకుల కోసం వ్యూయింగ్ పాయింట్లు, వాకింగ్ ట్రాక్‌లు, పార్కింగ్, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, విశ్రాంతి ప్రదేశాలు, సమాచార కేంద్రం, సుందరీకరణ, లైటింగ్ వంటి మౌలిక వసతుల కల్పనకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ, సందర్శకులకు ఆహ్లాదకర అనుభూతి కలిగేలా ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

# సౌర విద్యుత్‌తో పర్యావరణ పరిరక్షణ

కలెక్టర్ హరిత....



**పోరు తెలంగాణ అక్టోబర్ 01: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సౌర విద్యుత్ వినియోగంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' కింద సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని, నెలకు 360 యూనిట్ల వరకు విద్యుత్ పొందవచ్చని తెలిపారు. సోలార్ వినియోగంతో విద్యుత్ బిల్లులు తగ్గడమే కాకుండా, అదనపు ఆదాయం కూడా పొందవచ్చన్నారు. సౌర విద్యుత్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని, దీనిని వినియోగించుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# మాచారెడ్డిలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి అక్టోబర్ 1.(పోరు తెలంగాణ న్యూస్) :** కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను, సంబంధిత సిబ్బందిని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం తూకం, నాణ్యత పరిశీలన, కొనుగోలు మరియు చెల్లింపుల ప్రక్రియలో పారదర్శకత పాటించాలని ఆయన అన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మహమ్మద్ అలీ షబ్బీర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాచారెడ్డి సొసైటీ చైర్మన్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నౌసిలాల్, మాచారెడ్డి గ్రామ సర్పంచ్ సంతోష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది



చంద్రకాంత్ రెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గణేష్ నాయక్, సొసైటీ డైరెక్టర్లు శ్రీధర్ రావు, ఆనంద్ రెడ్డి, లఖ్య నాయక్, నవీన్ రెడ్డి, వెంకట్ రాజు, పంతం స్వామి, వెంకట్ రెడ్డి, పీట్ల శ్రీనివాస్, సులోచన, లడ్డు, సర్పంచులు వినోద ప్రభాకర్, అనిల్, శంకర్ నాయక్, రాంచంద్రం, ఉపసర్పంచ్ రాజు, బన్సీలాల్, రాజిరెడ్డి, అజీజ్ సహకార సంఘం ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

రెండో విడతలో 106 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ.ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్..

**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి :అక్టోబర్ 1.(పోరు తెలంగాణ న్యూస్:) :** పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతకు ఎంపికైన దాదాపు 106 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను అభినందించిన ఆయన, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని త్వరగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీమాట్లాడుతూ. ఇందిరమ్మ ఇల్లు అనేది కేవలం ఒక ఇల్లు కాదు.. ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీక. సొంతింటి కల నెరవేర్చాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోంది" అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యార్థులకు సంక్షేమ కార్యక్రమాలు వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం. సంక్షేమంతో పాటు రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, పట్టణాభివృద్ధి వంటి రంగాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి" అని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆయన తెలిపారు. పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, విద్యా సంస్థలు, క్రీడా మైదానాలు తదితర రంగాల్లో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పారదర్శకంగా వ్యవహరిస్తున్నాం. పేదలకు ఇల్లు, రైతులకు భరోసా, మహిళలకు ఆర్థిక సాధికారత, యువతకు ఉపాధి, విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



అని షబ్బీర్ అలీ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ నాణ్యమైన నిర్మాణాలను చేపట్టాలని, ఇళ్ల నిర్మాణంలో అధికారులు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప శ్రీనివాస్ ఉమారాణి, వైస్ చైర్మన్ కాసార్ల గోదావరి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్, కౌన్సిలర్లు వాజీద్, జావీద్, సావిత్రి, అఖిల, స్వప్న, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, యూనుస్, షేరు, అన్వార్, మన్సూర్, గంగాధర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి







జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**పోరు తెలంగాణ, మంచిర్యాల,అక్టోబర్ 1, 2026 :** వయోవృద్ధులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి, వయోవృద్ధుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, వయోవృద్ధుల అనుభవం, వారి సలహాలు, సూచనలు సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు తమ ఆస్తులు, భూములను పిల్లలకు బదలాయించిన అనంతరం నిర్లక్ష్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్తిపాస్తులు లేని వయోవృద్ధులను వారి పిల్లలు బాధ్యతగా చూసుకోవాలని తెలిపారు. వయోవృద్ధులు సమాజానికి విలువైన సంపద అని, కుటుంబానికి పెద్దలుగా వారు అందించే అనుభవం సమాజానికి కూడా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వయోవృద్ధుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత ముఖ్యమని, వయోవృద్ధులు క్రమం తప్పకుండా నడక, యోగా వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలను కొనసాగించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాల ద్వారా వయోవృద్ధులకు రక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో చట్టాన్ని అమలు చేయడం, గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సుమారు 35 వేల 250 మంది వయోవృద్ధులు వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారని, ప్రతి నెలా పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా సంఘాల ప్రతినిధులు గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వయోవృద్ధుల హక్కులు, సంక్షేమంపై సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ వయోవృద్ధులు తమకు కల్పించిన చట్టపరమైన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టం--2007లోని సెక్షన్ 23 ప్రకారం, వయోవృద్ధులు బదలాయించిన ఆస్తికి సంబంధించిన పరిస్థితులలో తగిన సందర్భాలలో ఆర్.డి.ఓ. కు బదలాయింపును రద్దు చేసే అధికారం ఉంటుందని వివరించారు. సెక్షన్ 24 ప్రకారం వయోవృద్ధులను, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు, జరిమానా వంటి నిబంధనలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, నిబంధనల ప్రకారం వారి జీతం నుంచి తల్లిదండ్రుల పోషణకు చెల్లింపులు చేయించే అవకాశం ఉన్నాయని తెలిపారు. చట్టంలోని నిబంధనలను పాటించని వారికి జరిమానా, శిక్ష వంటి చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రతి మంగళవారం డే కేర్ సెంటర్లలో వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వయోవృద్ధుల సమస్యలు, సహాయం కోసం 14567 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వయోవృద్ధులను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**పోరు తెలంగాణ, మంచిర్యాల,అక్టోబర్ 01, 2026 :** జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, పారిశుధ్య, సంక్షేమ, విద్యా కార్యక్రమాల నిర్వహణను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల మార్కెట్ ప్రాంతంలో కొనసాగుతున్న నగరాభివృద్ధి పనులను ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని తెలిపారు. గోదావరి పుష్కర ఘాట్ ప్రాంతాన్ని సందర్శించి అభివృద్ధి పనుల కోసం గుర్తించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజలకు, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేలా ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ఎన్‌టిఆర్ నగర్ ప్రాంతంలో



పారిశుధ్య నిర్వహణను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యటనలో భాగంగా ఒక ఇంటి వద్ద నీరు వృథాగా పోతుండటాన్ని గమనించి నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు. పాఠశాలలో ఎఫ్ ఆర్ ఎస్ ఆధారిత హాజరు నమోదును పరిశీలించి విద్యార్థుల హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, అవసరమైన అదనపు బోధన అందించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సేవలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాజు, మున్సిపల్ డిప్యూటీ ఈఈ, మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**పోరు తెలంగాణ, మంచిర్యాల,అక్టోబర్ 1, 2026 :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగం అధికారులతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, మ్యాపింగ్ కాని ఓటర్లు, అనమలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, వారి ఇండ్లకు వెళ్లి వారి నుంచి ధృవపత్రాల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి బూత్ స్థాయి అధికారులు ఓటర్ల ఇండ్ల వద్దకు వెళ్లి అవసరమైన ధ్రువపత్రాలను సేకరించాలని తెలిపారు. ఎ.ఈ.ఆర్.ఓ.లు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసే విధంగా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగేందుకు సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని తెలిపారు.





వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో నోటీసులు జారీ చేయబడిన ఓటర్లకు సంబంధించి వారి ఇండ్ల వద్ద అవసరమైన ధ్రువపత్రాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, ఎఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచాలి

కలెక్టర్ హరిత....

**పోరు తెలంగాణ అక్టోబర్ 01: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారితో కలిసి మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పీఎం శ్రీ పాఠశాలల ఉపాధ్యాయులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రిన్సిపాళ్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమగ్ర శిక్ష అభియాన్‌లో జిల్లా ర్యాంకు తక్కువగా ఉందని, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం కూడా తక్కువగా నమోదైందని తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతులు, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం వంటి





వివరాలను యూడైస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనుమతి లేకుండా తరచుగా గైర్హాజరవుతున్న ఉపాధ్యాయులను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలను తరచుగా సందర్శించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన అందించాలని కలెక్టర్ సూచించారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతంలో పురోగతి సాధించాలని ఆదేశించారు.

# టీఎంజేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా వత్తుల రఘుపతి నియామకం

ఎస్సీ కమిషన్ చైర్మన్ నియామకంలో

రొటేషన్ పద్ధతి పాటించాలి

మాదిగ, అనుబంధ కులాల జర్నలిస్టులకు

ప్రాధాన్యత ఇవ్వాలి:

వత్తుల రఘుపతి

**మహేశ్వరం, అక్టోబర్ 1, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర మాదిగ జర్నలిస్టుల ఫోరం (టీఎంజేఎఫ్) నూతన కమిటీని ఎన్నుకుంది. ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా మహేశ్వరం ప్రాంతానికి చెందిన వత్తుల రఘుపతిని నియమించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ మీడియా సెంటర్‌లో ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు భూర్గుల నాగేందర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి బొల్లెపాక రాజేష్ మాదిగ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీఎంజేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వత్తుల రఘుపతి మాట్లాడుతూ.. తెలంగాణ ఎస్సీ కమిషన్ ప్రస్తుత పదవీకాలం అక్టోబర్ 3, 2026తో ముగియనున్న నేపథ్యంలో తదుపరి కమిషన్ చైర్మన్ నియామకంలో రొటేషన్ పద్ధతిని పాటించాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో కమిషన్‌కు కల్పించిన ప్రాతినిధ్యాన్ని సమీక్షించి, ఒకే ఉపకులం లేదా ఒకే ప్రాంతానికే పరిమితం కాకుండా మాదిగ, మాలలతో పాటు అన్ని ఎస్సీ కులాలు, ప్రాంతాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన కోరారు.ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి, మంత్రిమండలి, ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా రఘుపతి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఎస్సీ కమిషన్‌లో మాదిగ, అనుబంధ కులాలకు చెందిన జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పనిచేసిన అనుభవం ఉన్న జర్నలిస్టులను కమిషన్‌లో నియమించే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని రఘుపతి సూచించారు. కుల అణచివేత, కుల వివక్ష నిర్మూలనపై అవగాహనతో పాటు సామాజిక సమస్యలపై లోతైన



అవగాహన, దూరదృష్టి ఉన్నవారికి కమిషన్‌లో అవకాశం కల్పించాలని అన్నారు.కుల వివక్ష, కుల బహిష్కరణ, సామాజిక వెలివేత, గ్రామస్థాయి ఘర్షణలు తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సమస్యలను గుర్తించి నివారించే విధంగా కమిషన్ కార్యాచరణ ఉండాలని ఆయన కోరారు. ముఖ్యంగా ఎస్సీ--బీసీ కులాల మధ్య ఘర్షణలకు దారితీసే సమస్యలను సంభాషణ, అవగాహన, చట్టపరమైన చర్యల ద్వారా పరిష్కరించే దిశగా కమిషన్ పనిచేయాలని రఘుపతి అన్నారు.కమిషన్ నియామకాల్లో అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ సలహాదారులు మైలారపు ప్రేమ్, సుంచు లింగయ్య, పసుల తిరుపతి, జిలకర కృష్ణాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కడియం నాగయ్య, దుబ్బ నగేష్, కార్యదర్శులు చెల్మెడ్ అనీల్, గంట వెంకన్న, మహంకాళి భిక్షపతి, ప్రచార కార్యదర్శులు కల్మకోల్ యాదయ్య, చింత ప్రవీణ్, కోశాధికారి బొట్ల సదానందం, అధికార ప్రతినిధి పంగిడిచెరువు వెంకటేష్, సహాయ కార్యదర్శి కాడేపగ శ్రీనివాస్, నాయకులు బొల్లె రాజయ్య, దరువుల శంకర్, మీసాల సైదులు, లంక స్వామి, రాయుడు, బాలకృష్ణ, రామస్వామి, దానప్పగారి శేఖర్, భీంలాల్, కరుణాకర్, వత్తుల భాస్కర్, బొల్లెపాక విజేందర్,దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఏ-1 పరీక్షల సరళిని పరిశీలించిన డీడీ జాదవ్ అంబాజీ

విద్యార్థుల హాజరు, వసతి, భోజన నాణ్యతపై ఆరా....

పౌష్టికాహారం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని

ఉపాధ్యాయులకు సూచన....

**పోరు తెలంగాణ అక్టోబర్ 01: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు జాదవ్ అంబాజీ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. గురువారం నుంచి ప్రారంభమైన ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణ విధానం, వసతి గృహం, భోజనశాల, వంటశాల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి చదువు,





భోజనం నాణ్యత, వసతి, ఆరోగ్యం, ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందేలా ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా సౌకర్యాలు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అనంతరం పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు, వసతి గృహ నిర్వహణను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలల నిర్వహణ మెరుగుపడాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన లక్ష్యమని జాదవ్ అంబాజీ స్పష్టం చేశారు.

# అరుదైన నీలి రంగు పుట్టగొడుగు



**పోరు తెలంగాణ అక్టోబర్ 01: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) అటవీ డివిజన్ పరిధిలోని మాకిడి సెక్షన్, గొల్యాల్ అటవీ ప్రాంతంలో అరుదైన నీలిరంగు పుట్టగొడుగు కనిపించింది. ఎంటోలోమా హోచెట్టరీ లేదా 'బ్లూ పింక్ గిల్'గా పిలిచే ఈ జాతి సాధారణంగా న్యూజిలాండ్ అడవుల్లో కనిపిస్తుందని అధికారి మోహన్‌రావు తెలిపారు. అజులిన్ వర్ణద్రవ్యం కారణంగా నీలిరంగులో ఉంటాయని, తెలంగాణ అడవుల్లో కనిపించడం జీవ వైవిధ్యానికి నిదర్శనమన్నారు. ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ వీటిని తినకూడదని హెచ్చరించారు.

# డీజీపీ సీవీ ఆనంద్‌కు టెన్నిస్ అసోసియేషన్ ఘన సన్మానం

AISTA--2026 టెన్నిస్ టోర్నమెంట్ జ్ఞాపిక అందజేత



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, అక్టోబర్ 01(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం) :** శ్యామల గోపాలన్ AISTA--2026 టెన్నిస్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. టోర్నమెంట్ విజయవంతంగా ముగిసిన సందర్భంగా జిల్లా టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వై. వెంకటేశ్వర్లు డీజీపీ సీవీ ఆనంద్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం శ్యామల గోపాలన్ AISTA--2026 టెన్నిస్ టోర్నమెంట్ జ్ఞాపికను ఆయనకు అందజేశారు. టెన్నిస్ క్రీడాభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరు కావడానికి అంగీకరించి, ఆహ్వానాన్ని గౌరవించినందుకు డీజీపీ సీవీ ఆనంద్‌కు అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహణ, క్రీడాకారుల భాగస్వామ్యం, కార్యక్రమ విజయవంతంపై అసోసియేషన్ ప్రతినిధులు డీజీపీకి వివరించారు. క్రీడలకు పోలీసు శాఖ నుంచి అందుతున్న ప్రోత్సాహాన్ని వారు అభినందించారు.

# డబ్బాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల రీ-సర్వే

అర్హులకే న్యాయం చేస్తామన్న పీడీ ప్రకాష్ రావు....



**పోరు తెలంగాణ అక్టోబర్ 01: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల రీ-సర్వేను హౌసింగ్ పీడీ ప్రకాష్ రావు పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకంలో నిజమైన నిరుపేదలకు, ఇళ్లు లేనివారికి న్యాయం జరిగేలా అర్హులను గుర్తించేందుకు ఈ సర్వే చేపట్టారు.గ్రామంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఇంటి పరిస్థితి, ఆదాయం, ఇప్పటికే ఇల్లు ఉందా లేదా అనే అంశాలను క్షుణ్ణంగా విచారించారు. అర్హులకు న్యాయం జరిగేలా, అనర్హులను తొలగిస్తూ జాబితాను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిజమైన అర్హులకు మాత్రమే ఇళ్లు మంజూరయ్యేలా పారదర్శకంగా సర్వే నిర్వహిస్తున్నామని పీడీ ప్రకాష్ రావు చెప్పారు. అర్హులెవరూ ఆందోళన చెందవద్దని, అందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సాజుద్దీన్, సిబ్బంది, గ్రామ సర్పంచ్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ యాదవ్, కారోబార్ రవీంద్రనాథ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎన్నికలపై ఐఎన్‌టీయూసీ నాయకులతో శ్యామ్ నాయక్ సమీక్ష

**పోరు తెలంగాణ అక్టోబర్ 01: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆర్టీసీ ఎన్నికల నేపథ్యంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ ఐఎన్‌టీయూసీ నాయకులతో సమావేశమై ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధివిధానాలు, కార్మికుల సమస్యలు, యూనియన్ బలోపేతం, కార్మికుల హక్కులు, సంక్షేమం వంటి అంశాలపై నాయకులతో వివరంగా మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు నాయకులంతా సమష్టిగా కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మంగ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు లోకేష్, ఆర్టీసీ విశ్రాంత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ చిన్నారులకు సమతుల్య పౌష్టికాహారం అందించాలి

కలెక్టర్ హరిత....



**పోరు తెలంగాణ అక్టోబర్ 01 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు సమతుల్య పౌష్టికాహారం అందించి, వారు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ అంగన్వాడీ కేంద్రంలో 'తొలిముద్ద' అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, మున్సిపల్ చైర్ పర్సన్ మెంగ్రే ఆకాష్‌తో కలిసి చిన్నారులకు ఉప్మా, కిచిడీ అల్పాహారాన్ని తినిపించారు.3 నుంచి 6 సంవత్సరాల వయసు గల పిల్లలను తల్లులు అంగన్వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.అనంతరం జనకాపూర్ రైతు వేదికలో పోషణ మాసంలో భాగంగా గర్భిణులకు నిర్వహించిన శ్రీమంతం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. మహిళలు, గర్భిణుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని, అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సకాలంలో తీసుకోవాలని ఆమె కోరారు. పరిశుభ్రత, ఆరోగ్య రక్షణ, ప్రారంభ విద్యపై మహిళలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

# రికార్డుల కోసం సర్పంచ్ పోరాటం

కోనప్ప ధర్నా హెచ్చరికతో దిగివచ్చిన అధికారులు....

**పోరు తెలంగాణ అక్టోబర్ 01: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం నాలుగు నెలల క్రితం తనిఖీ పేరుతో అడిషనల్ కలెక్టర్ తీసుకెళ్లిన గ్రామపంచాయతీ రికార్డులను అధికారులు ఎట్టకేలకు తిరిగి అప్పగించారు. రికార్డులు లేకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని సభ దృష్టికి తీసుకెళ్లారు. రికార్డులు లేక పనులు చేయలేకపోతున్నానని, ఇందుకు ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెబుతున్నానని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సర్పంచ్‌కు మద్దతుగా నిలిచారు. గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. దీంతో స్పందించిన అధికారులు బుధవారం రాత్రే రికార్డులను పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. దీంతో ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. తన వినతిని మన్నించిన అధికారులకు, అండగా నిలిచిన కోనప్పకు, బీఆర్ఎస్ నాయకులకు, మీడియా మిత్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తనకు జరిగిన అన్యాయంపై పోరాడేందుకు వచ్చిన ప్రతి ఒక్కరి దీవెనలు ఎల్లవేళలా తనపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు.



# డీఈఓను మర్యాదపూర్వకంగా కలిసిన ట్రస్మా నాయకులు



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, అక్టోబర్ 01(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. శంభు ప్రసాద్‌ను జిల్లా ట్రస్మా (టి ఆర్ ఎస్ ఎం ఏ) నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యాభివృద్ధికి సంబంధించిన అంశాలు, ప్రభుత్వ నిబంధనల అమలు తదితర విషయాలపై డీఈఓతో చర్చించారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను నాయకులు డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడంతో పాటు పాఠశాలల నిర్వహణకు సంబంధించి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా డీఈఓ ఎం.శంభు ప్రసాద్ సానుకూలంగా స్పందిస్తూ, విద్యాభివృద్ధికి సంబంధించి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చినట్లు ట్రస్మా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి. రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కృష్ణ ప్రసాద్, పాల్వంచ ప్రైవేట్ స్కూల్స్ అధ్యక్షులు ముర్తుజా, ప్రధాన కార్యదర్శి మాస్టర్ మైండ్స్ రాజు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు, విజ్ఞాన్ స్కూల్ సోందు సాహెబ్, జాయింట్ సెక్రటరీ, ఆదర్శ స్కూల్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.